REGD. NO. A. 40 | విడి ప్రతి 12 నయాపైసలు | 31-1-58 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 30 : మేనేజింగు ఎడిటరు : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి : సంచిక 5



తన పితామహి శ్రీమతి పిచ్చమ్మగారి పేరుతో శ్రీ తిక్కవరపు రామరెడ్డిగారు నిర్మించి యిచ్చిన 40 పడకల వార్డు.



తన మాతామహి శ్రీమతి బెజవాడ సుబ్బమ్మ పేరుతో శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డిగారు కట్టించిన 20 పడకల వార్డు.

# క్షయాసుపత్రి క్రొత్తవార్డుల ప్రారంభోత్సవము

## కుష్ఠురోగ చికిత్సాలయానికి లక్ష ఇవ్వగలనని శ్రీ రామరెడ్డి

## నెల్లూరు వదాన్యతను లోకమంతా చాటగలనని కేంద్రమంత్రి కర్మార్కర్

ఈ నెల 29 తేది సాయంత్రం నెల్లూరు క్షయాసుపత్రి క్రొత్త వార్డుల, వసతి గృహముల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనోత్సవాలు, ఆనందోత్సాహాతిశయాల మధ్య అత్యంత వైభవంగా జరిగినవి. మంత్రులు, పురప్రముఖులు, అధికారులు, జిల్లా వివిధ ప్రాంతాలనుండి వచ్చిన రైతు ప్రముఖులనేకులు పాల్గొన్నారు.

కేంద్రీ ఆరోగ్యశాఖామంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్, ఆర్థికమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారలు క్షయాసుపత్రి ప్రవేశించగానే, క్షయాసుపత్రి సంక్షేమసంఘాధ్యక్షులు శ్రీ తిక్కవరపు రామరెడ్డి ప్రభృతులు, ఆసుపత్రి సూపరింటెండెంటు డా॥ భావనారాయణగారు మంత్రులకు మంగళ తూర్యారావములతో, ఘనస్వాగతమిచ్చారు. దాతలను, సంక్షేమసంఘ సభ్యులను, శ్రీ గోపాలరెడ్డి కేంద్రమంత్రికి పరిచయం చేశారు.



శ్రీ మేనకూరు దశరథరామరెడ్డి, శ్రీ ఇంగువ శ్రీకృష్ణయ్యగారలు నిర్మించి యిచ్చిన వసతి గృహములు

పిమ్మట క్షయాసుపత్రి ఆవరణంలో సాయినాగరాకం పెసీవారిచే, విద్యుద్దీపాలతో మనోహరంగా అలంకరించబడిన పందిరిలో మంత్రులు ప్రవేశించారు. శ్రీ తిక్కవరపు రామరెడ్డిగారు, అధ్యక్షస్థానం అలంకరించ వలసినదిగా డా॥ గోపాలరెడ్డిగారిని, కేంద్ర మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్, శ్రీ ఏ.సి. సుబ్బారెడ్డిగారిని, మెడికల్ సర్వీసెస్ డైరెక్టరు డాక్టరు కె. యస్. రావు గార్లను, వారి స్థానములను అలంకరించవలసినదిగా కోరారు.

డా॥ గోపాలరెడ్డిగారు నాటిసభకధ్యక్షత వహించారు. శ్రీ గోపాలరెడ్డి, కేంద్రీ మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్, డా॥ కె. యస్. రావు, శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారలను శ్రీ రామరెడ్డి పుష్పమాలాభూషితులంగావించారు. దాతలందరినీ, శ్రీ ఒబ్బేటి విశ్వనాధరావుగారు పుష్పమాలాలంకృతులను చేశారు.



కేంద్రీ ఆరోగ్య మంత్రి
శ్రీ కర్మార్కర్

### శ్రీ విశ్వనాదరావు విజ్ఞప్తి

శ్రీ మోచర్ల రామకృష్ణయ్యగారి ప్రార్థనతో సభ ప్రారంభమైంది. పిమ్మట శ్రీ ఒబ్బేటి విశ్వనాధరావుగారు మంత్రులకు విజ్ఞాపన పత్రిమును సమర్పిస్తూ, క్షయాసు పత్రిపరిస్థితిని, వివిధదశలలో ఆస్పత్రి పురోభివృద్ధిని వివరించారు. క్షయాసుపత్రికి మంచి నీటి వసతిని కల్పించమని, క్రిందితరగతి సిబ్బందికి, నర్సులకు, డాక్టరులకు, ఆస్పత్రి సమీపంలో గృహవసతి కల్పించమనీ, మరికొన్ని స్పెషల్ వార్డులను కట్టించమనీ, క్షయరోగుల వినోదకేంద్రమును, పునరావాస కేంద్రమును నిర్మించమనీ కోరారు. క్షయాసుపత్రి ప్రాంతానికి "గోపాలనగర్" అని పేరిడ నట్లు ప్రకటించారు.

—కొరవ 8 వ పేజీలో

ప్రతియింట నుండదగిన సంజీవిని!

## ఆరోగ్య లేహ్యము

మీరు ప్రతిదినము రాత్రి కొలదిఆరోగ్యలేహ్యము సేవించిన ప్రాతఃకాలనే ఒక్కసారి సాఫీగా మలమును విసర్జింపజేయును. మలబద్ధకము, అతిఉష్ణము, పాలమాలికను పోగొట్టి శక్తి నొసంగును ఉత్సాహమును కలుగజేయును. రక్తశుద్ధి, రక్తవృద్ధి పరచును మెదడును దేహమును బలపరచి ఆరోగ్యముగా నుంచును.

అజీర్ణము, ఆకలిమాంద్యము, కడుపుబ్బరము, పులితేపులు, నాడీ దౌర్బల్యము, కీళ్లనొప్పులు, మంటలు, తిమ్మిర్లు, నిద్రరాకుండుట ఇత్యాదులను పోగొట్టుటలో అమోఘమైన దివ్యౌషధము. మలబద్ధకమున్నవారు నిర్లక్ష్యము చేయక ఆరోగ్య లేహ్యమును సేవించి మలబద్ధకమును మాన్పవలెను. లేనియెడల అనేకములైన వ్యాధులు శరీరమునచేరి ఆరోగ్యమును పాడుచేయును. ఇది బిడ్డలు మొదలు వృద్ధులవరకు, గర్భిణీ స్త్రీలు సహితము ఉపయోగించవచ్చును. పథ్యమేమియు లేదు.

20 తులముల డబ్బీ 2-0-0 | శాంపిల్ డబ్బీ 0-6-0

అన్ని మందుల షాపులలో దొరకును.

— బాబిలాక్ ఫార్మసి —

సుబేదారుపేట :: నెల్లూరు.

# హైదరాబాద్ లేఖ

*** మా విలేకరి ***

## ● సంజీవరెడ్డిగారి నాయకత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ శాసనసభ్యులలో సమైక్యకృషి
## ● ఏక వేదిక మీాద డాక్టరు చెన్నారెడ్డి, బొమ్మకంటి, పాగా పుల్లారెడ్డిగారలు
## ● భూసంస్కరణలపట్ల, రివిన్యూమంత్రి మినహా, తక్కిన అందరు మంత్రుల ఔదాసీన్యం?

ఆంధ్ర, తెలంగాణా, – ఉభయప్రాంతాల్లోను, శ్రీ సంజీవరెడ్డి నాయకత్వంపట్ల అసంతృప్తి చెందిన కాంగ్రెసువాదులు, ముఖ్యంగా కాంగ్రెసు శాసనసభ్యులందరినీ సమైక్యపరచే ఒక ప్రయత్నం, గతవారం నగరంలో ప్రారంభమైంది. లచ్చన్న, చెన్నారెడ్డిగారలేకాక, బొమ్మకంటి సత్యనారాయణరావు (ఖమ్మం), పాగా పుల్లారెడ్డి (మహబూబునగర్) గారలుకూడా ఈ విషయంలో చొరవతీసుకున్నారు. బొమ్మకంటి, పుల్లారెడ్డిగారలు, చెన్నారెడ్డిగారితో కలిసి ఒకే వేదికమీదకి రావడం గత పది సంవత్సరాలలో ఇదే మొదటిసారని చెప్పవలసి వుంటుంది.

వీరందరి సమావేశోద్దేశం గురించి వేర్వేరు అభిప్రాయాలున్నాయి. రాష్ట్రశాసనసభ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపట్ల అవిశ్వాసం వెలిబుచ్చే వారెందరి సంతకాలు తీసుకొనడానికే ఈ సమావేశాన్ని పిలిచారని కొందరు చెబితే, కాదు కేవలం ఒకరినొకరు అర్థంచేసుకొనడానికి మాత్రమే సమావేశమైనారని మరికొందరు చెప్పారు. కాగితంమీాద సంతకం పెట్టవలసిన ప్రశ్న వచ్చేసరికి, సమావేశంలో పాల్గొన్నవారిలో చాలా అభిప్రాయభేదాలు వచ్చాయని తెలుస్తోంది. అయితే ఈ విభేదాలు, సంజీవరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించడంపట్ల కాదుకాని ఆ తరువాత ఏమిటన్న ప్రశ్నపైనేనని తెలుస్తోంది.

పైన చెప్పినట్లు, తెలంగాణాకు చెందిన ఈ రెండువర్గాల వారికి ఏకైకలక్ష్యం ఏర్పడింది ఇప్పుడే. ఈ లక్ష్యంకూడా నకారాత్మకమైనదే. అందుకే తమ లక్ష్యసాధనకు ఏదో ఒక చర్యతీసుకోవాలనే సరికి సందేహాలు, అభిప్రాయ విభేదాలు తలెత్తివచ్చాయి. అసలు బొమ్మకంటి చొరవతీసుకోవడమే కొందరికి ఇష్టంలేకపోయింది. ఆయన ఇంట్లో ఏర్పాటుచేసిన సమావేశాన్ని మరోచోటికి మార్చవలసివచ్చింది. సమష్టిచర్య ఏదైనా తీసుకుందామని సూచనవస్తే, అసలు, కొన్ని కాంగ్రెసు విధానాలపట్ల కొందరు ప్రముఖుల అభిప్రాయాలు స్పష్టంకావాలని మాజీ ఉపమంత్రి రాజలింగం ప్రభృతులు పట్టుబట్టారట. భూసంస్కరణలు, జాతీయకరణలాంటి ముఖ్యమైన కాంగ్రెస్ నిశ్చిత విధానాలపట్ల లచ్చన్న, చెన్నారెడ్డి ప్రభృతులు తమ వైఖరులను స్పష్టపరచుకోకపోతే కలిసి పనిచేయడం కష్టమన్నారట. ఇలాంటి తర్జనభర్జనలు జరిగిన తరువాత, అసలు తమకందరికీ సంజీవరెడ్డి నాయకత్వంపట్ల ఎందుకు అసంతృప్తి జనించిందో ఆ విషయాన్ని ప్రజలకు, కాంగ్రెసు కార్యకర్తలకు, కాంగ్రెసు అధిష్ఠాన వర్గానికి నచ్చచెప్పాలనీ, అందుకై ఒక చిన్న సంఘాన్ని వేయాలనీ నిశ్చయించారు. వీరి మొదటి సమస్య, రానున్న రాష్ట్ర ఎగువసభ ఎన్నికలకు సంబంధించినది. ప్రదేశ కాంగ్రెసు ఎన్నికలసంఘం పూర్తిగా మంత్రివర్గ అనుయాయులతోనే నిండివున్నందున, తమకు న్యాయం జరగదనీ, ఎగువసభకు కాంగ్రెస్ అభ్యర్థులను, కాంగ్రెస్ శాసనసభా పక్షం సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిన ఎన్నుకునే అవకాశం కల్పించాలనీ వీరు కాంగ్రెసు అధిష్ఠానవర్గాన్ని కోర నిశ్చయించారు.

ఈ సమావేశ ధోరణి దృష్ట్యా పరిశీలిస్తే ఇప్పట్లో ప్రధానమైన మార్పులు వచ్చే చర్యలేవీ తీసుకోవడం జరగదని భావించవచ్చును. మొత్తంమీద కాస్తవిస్తృతమైన సమష్టియత్నం మాత్రం ప్రారంభమైందని చెప్పవచ్చును. ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశ సందర్భంలో ఈ యత్న సాఫల్యానికి మరికొంత కృషిజరిగినా, జూన్, జూలై నెలలవరకు నిర్దుష్టమైన చర్యలను చెన్నారెడ్డి ప్రభృతులు తీసుకోకపోవచ్చును. ఈ లోగా ప్రదేశ్ కాంగ్రెసు

—కొరవ 6వ పేజీలో

### అవిశ్వాసతీర్మానంలేదు!

శ్రీ సంజీవరెడ్డి వ్యతిరేకవర్గానికి చెందిన ఒక ప్రముఖ నాయకుడు మా విలేఖరితో ఇలా అన్నాడు.

"సంజీవరెడ్డిగారికి వ్యతిరేకంగా సంతకాలుసేకరించడంలేదు ప్రస్తుతం అవిశ్వాసతీర్మానం తెచ్చే ఆలోచనగూడా లేదు. అయితే మంత్రివర్గ ప్రజావ్యతిరేక, కాంగ్రెసు వ్యతిరేక చర్యలను పార్టీలో, శాసనసభలో బహిర్గత పరచటం జరుగుతుంది. కౌన్సిల్ ఎన్నికలలో మాకు సరైన ప్రాతినిధ్యం కలుగజేయమని కోరతాం. ఇవ్వకుంటే తగాదా తప్పదు. ఇప్పటివరకు 80 మంది శాసన సభ్యులు మా వర్గంలో వున్నారు. అందులో తెలంగాణావారు 26మంది. ఈ వర్గం ఒక కార్యావరణ సమితిని ఏర్పరచింది. దానికి సమావేశకర్త బొమ్మకంటి."





అతడు వట్టి కూలిపనివాడే కాదు. ఇప్పుడతడు నిర్మాణానికి సాయపడుతూన్న పెద్ద నీటి పారుదల ప్రాజెక్టుకు ఏబదిమైళ్ల దూరంలోనే వున్న అతని స్వగ్రామంలో అతనికి 6 ఎకరాల భూమి వున్నది. ఇకమీద అతనికి మంచి భవిష్యత్తు కలదు. ఇప్పుడు రెండేళ్లుగా అతడు ఆనకట్టమీద పనిచేస్తున్నాడు. ఆ బృహత్కార్యం అతని కళ్ల యెదుటనే పూర్తి కానున్నది—అతని కల నిజమౌతూ వుంది. ఇంకేమి, అతడు తన గ్రామానికి మళ్లి, తనకు కావలసినవన్నీ పంట పండించుకుంటాడు. తన భూసాయంవల్ల వచ్చు లాభానికి తోడుగా, ఆతడొక చిన్న గృహపరిశ్రమను సయితం స్థాపించవచ్చు.

భారతదేశమంతటా ఇంకా ఎన్నెన్నో నదీలోయ ప్రాజెక్టులు నిర్మాణమవుతున్నాయి. ఇంకా ఎంతో భూమికి నీటి పారుదల ఏర్పాట్లు జరుగుతాయి. పరిశ్రమయంత్రాల్ని నడపడానికి అవసరమైన విద్యుచ్ఛక్తి తక్కువ ఖర్చులో లభించగలదు. నదీ ప్రవాహాలవల్ల ప్రాణనష్టంకాని, ఆస్తి నష్టంకాని జరగక, ప్రజాజీవనం సుక్షేమంగా, సుభిక్షంగా వుంటుంది. కాని, ఇవన్నిటికీ డబ్బు కావాలి, ఎంతో డబ్బు కావాలి.

నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లలో గాని, ప్రభుత్వ హామీ గల ఇతర స్వల్ప ఆదా స్కీము సెక్యూరిటీలలోగాని పెట్టుబడి చేసిన మీ ఆదా, ఎంత స్వల్పమైనా సరే, ప్రభుత్వానికి అవసరమైన సొమ్మును సమకూర్చగలదు. ఈ మీ సొమ్మును ఇన్‌కంటాక్సు లేని వడ్డీతో సహా మీకు ఇచ్చివేస్తారు.

12 సం॥ల నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లు

* 5.41 శాతం ఇన్‌కంటాక్సు లేని సంవత్సర ప్రతిపత్తి.
* రూ. 5 మొదలు రూ. 5000 వరకు గల డినామినేషనులలో ఈ సర్టిఫికెట్లు అన్ని పోస్టాఫీసులలోనూ సులువుగా దొరుకుతాయి.
* దీనికి ప్రభుత్వ హామీ గలదు.

స్వల్ప ఆదా స్కీములో గల మరికొన్ని ప్రభుత్వ సెక్యూరిటీలు:

10 సం॥ల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు
పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు డిపాజిట్లు




DA 57/283

నేషనల్ సేవింగ్స్ ఆర్గనైజేషన్

[illegible] వివరాలకు ఈ పెట్టుబడులను గురించి వివరములకు నాగపూర్‌లో గల నేషనల్ సేవింగ్స్ కమీషనర్ [illegible], మీ రాష్ట్రంలో గల రీజనల్ నేషనల్ సేవింగ్సు అధికారివద్దనుండిగాని తెలియగలరు.

